నవతెలంగాణ
ఆదిలాబాద్
గురువారం | అక్టోబర్ 12, 2023 | www.navatelangana.com

స్నేహ యూత్ ప్రచార కార్యదర్శికి సన్మానం

జన్నారం : సద్భావనా ఫోరమ్ కమిటీ కరీంనగర్ 154 జయంతి పురస్కరించుకొని కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో జన్నారానికి చెందిన స్నేహ యూత్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి దుమల్ల అశోక్‌ని సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతు 2003 నుండి స్నేహ యూత్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమలు నిర్వహిస్తున్నామన్నారు. ఆటల పోటీలు, యువజన సంఘాలు ఏర్పాటు, రక్తదాన శిబిరాలు, సంఘాలకు ఆట వస్తువుల పంపిణీ, స్కూల్ పిల్లలకు బ్యాగ్స్, బుక్స్ పంపిణీ తదితర కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. తాను 18 సార్లు రక్తాదానం చేశానని పేర్కొన్నారు. తనను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన సద్భావనా ఫోరమ్ కమిటీ అధ్యక్షులు కిరణ్‌కుమార్‌కు, సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు పొందిన అశోక్‌ను యూత్ అధ్యక్షులు దుమల్ల రమేష్, సభ్యులు రాజలింగు, ఉదయ్, ప్రశాంత్, ప్రవీణ్, శివకుమార్, జైకుమార్, నిశాంత్ అభినందనలు తెలిపారు.



విధి నిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్న రాజేశ్వర్

నవతెలంగాణ-ఉట్నూర్

విధి నిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్న వ్యక్తి ఇన్‌చార్జి డీఆర్వో జాడి రాజేశ్వర్ అని జెడ్పి చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. బుధవారం గంగన్నపేటలో ఆయన నివాసంలో శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పి చైర్మన్ రాథోడ్ జనార్ధన్ హాజరై చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో చిన్న, పెద్ద అనే తేడాలు లేకుండా అందరిని కలుపుకొని వెళ్లేవారన్నారు. ఆయన అకాల మరణం బాధాకరమన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి ప్రకటించారు.



ప్రచారం షురూ..!

- విస్తృతంగా పర్యటిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- జనాల్లోకి వెళ్తున్న కాంగ్రెస్, బీజేపీ ఆశావహులు
- బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్న బీఎస్పీ, డీఎస్పీ
- ఉమ్మడి జిల్లాలో రసవత్తరంగా మారుతున్న రాజకీయం

ఓట్ల పర్వానికి మరో 50రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం అప్పుడే ఊపందుకుంది. పక్షం రోజుల క్రితమే టికెట్లు దక్కించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు పల్లె, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించగా.. టికెట్ల కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్, బీజేపీ ఆశావహులు సైతం జనాల్లోకి వెళ్తూ ఎన్నికల బరిలో ఉంటున్నామని స్పష్టం చేస్తున్నారు. వీరితో పాటు ఇప్పటికే సిర్పూర్‌లో బహుజన్ సమాజ్ పార్టీ పోటీ చేయడం ఖరారు కాగా.. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ధర్మసమాజ్‌పార్టీ సైతం పోటీకి సిద్ధమవడం ఆసక్తికరంగా మారుతోంది. పలువురు స్వతంత్రులు సైతం పోటీకి సమాయత్తం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే పలు పార్టీలకు చెందిన అగ్రనాయకులు ఉమ్మడి జిల్లాలో పర్యటించి శ్రేణుల్లో ఉత్సాహం నింపగా.. మిగితా పార్టీల నాయకులు సైతం పర్యటించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.



దస్తురాబాద్ మండలంలో జాన్సన్‌నాయక్ ప్రచారం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల సమరానికి సమయం దగ్గర పడుతోంది. నవంబర్ 30న ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో తలపడేందుకు ప్రధాన పార్టీలు సంసిద్ధమవుతున్నాయి. ఈ సారి నువ్వా-నేనా అనే రీతిలో అన్ని పార్టీలు పోటీకి సమాయత్తం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే టికెట్లు ఖరారు కావడంతో ఉమ్మడి జిల్లా అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు రోజువారీగా పల్లెలు, పట్టణాల్లో పర్యటిస్తూ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. మరోసారి గెలిచి అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నారు. పదేండ్ల పాటు అమలు చేసిన పథకాలను వివరిస్తూ ప్రజల మద్దతు కూడగడుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్ జిల్లాలో మంత్రులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), హరీష్‌రావు పర్యటించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపినట్లయింది. ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన కూడా వచ్చే నెలలో ఖరారు కావడంతో ఆ పార్టీ అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మరోపక్క కాంగ్రెస్ సైతం అధికారమే పరమావధిగా ప్రయత్నాలు ప్రారంభించింది. కానీ ఇంకా ఆ పార్టీలో టికెట్ల పర్వం పూర్తికాకపోవడంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఉమ్మడి జిల్లాలోని కొన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిందనే ప్రచారం జరుగుతుండగా.. జాబితా మాత్రం బయటకు రావడం లేదు. దీంతో ఎవరికి టికెట్ లభిస్తుందోనని ఆ పార్టీ ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే కొన్ని చోట్ల టికెట్ తమకే వస్తుందనే గట్టి నమ్మకంతో ఉన్న ఆశావహులు ప్రజలను కలుస్తూ గెలిపించాలని కోరుతున్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇక బీజేపీలోనూ టికెట్ల పర్వం పూర్తికావడం లేదు. ఆ పార్టీ తరపున పోటీ చేసేందుకు ఇప్పటికే పలువురు ఆశావహులు సిద్ధమవుతున్నారు. టికెట్లు ఖరారు కాకపోవడంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే కొన్ని చోట్ల ఆ పార్టీ ఆశావహులు టికెట్ వస్తుందనే నమ్మకంతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం ఆసక్తికరంగా మారుతోంది.

బీఎస్పీ, డీఎస్పీలు సమాయత్తం..!

బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ), ధర్మసమాజ్‌పార్టీ(డీఎస్పీ)లు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నాయి. సిర్పూర్ నియోజకవర్గంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పోటీ చేయడం ఖరారైంది. ప్రస్తుతం ఆ పార్టీ ఉమ్మడి జిల్లాలో సిర్పూర్‌లో మాత్రమే అభ్యర్థిని ప్రకటించడం గమనార్హం. మరోపక్క ఇదే లక్ష్యంతో ఉన్న ధర్మసమాజ్ పార్టీ సైతం ఆదిలాబాద్ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సమాయత్తమవుతోంది. ఇప్పటికే ఆ పార్టీ అభ్యర్థిగా అగ్గిమల్ల గణేష్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.విశారధన్ మహరాజ్ ప్రకటించారు. దీంతో ఇప్పటికే గణేష్ గ్రామాల్లో ప్రచారం ప్రారంభించారు. మరోపక్క బోథ్ నియోజకవర్గంలో తుడుందెబ్బ సైతం బరిలో నిలించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేశారు. టికెట్ వస్తే కాంగ్రెస్ తరపున.. రాకపోతే స్వతంత్రంగానైనా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు సైతం పోటీలో ఉండేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

చేసిన సేవలే గుర్తుండిపోతాయి..

- డీఎఫ్ఓ శివ్ ఆశిస్‌సింగ్



నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, వారు స్థానికంగా ఉండి చేసిన సేవలే ప్రజల్లో గుర్తుండిపోతాయని డిఎఫ్ఓ శివ్ ఆశిస్ సింగ్ అన్నారు. ఎఫ్‌డిఓగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల హైదరాబాద్ అరణ్య భవన్‌కు బదిలీపై వెళ్లిన సిరిపురం మాధవరావు వీడ్కోలు సభ టిడిసి సెంటర్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు, వివిధ పార్టీల నాయకులు మాధవరావు దంపతులను శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎఫ్ఓ హాజరై మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్‌లో ఎన్నో అభివృద్ధి పనులు చేయడానికి మాధవరావు కృషి చేశారన్నారు. అక్రమ కలప రవాణా నివారణలో, అటవీ జంతువుల సంరక్షణలో, అడవిలో అభివృద్ధి పనులు చేయడంలో సేవలు మరువలేనివన్నారు. అటవీ సంరక్షణలో చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ఆఫీస్ ఉద్దీన్, పోచమల్లు, ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యులు మున్వార్ అలీఖాన్, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

15న మంచిర్యాలలో గద్దర్ సంస్మరణ సభ

- కరపత్రాలు విడుదల చేసిన ఆహ్వాన సంఘం నాయకులు



నవతెలంగాణ-మంచిర్యాల

ఈ నెల 15న ఆదివారం నస్పూర్‌లో ప్రజా యుద్ధ నౌక గద్దర్, పాత్రికేయులు జహీరుద్దీన్ అలీ ఖాన్ సంస్కరణ సభను ఏర్పాటు చేశామని ఆహ్వాన సంఘ కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు మంచిర్యాలలో బుధవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక యోధుడు గద్దర్, భారత్ బచావో రాష్ట్ర కమిటీ చైర్మన్ జహీరుద్దీన్ అలీ ఖాన్ సంస్మరణ సభ సిసిసి షిర్కే కాలనీ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. తెలంగాణలోని బడుగు బలహీన వర్గాల ప్రజాస్వామిక ఆకాంక్షల రూపంగా నిలిచిన గద్దర్‌ను సంస్మరించుకోవడం ద్వారా ఆయన అందించిన వారసత్వాన్ని కొనసాగించాలని తెలిపారు. తెలంగాణలో బడుగుల సంక్షేమం నెలకొల్పే వ్యవస్థ రావాలని గద్దర్ కోరుకున్నారని పేర్కొన్నారు. ఈ సంస్మరణ సభలో భారత్ బచావో జాతీయ కార్యదర్శి గాదె ఇన్నయ్య, ప్రముఖ బహుజనవాది జేబీ రాజు, భారత్ వాచావో రాష్ట్ర నాయకులు జయసింగ్ రాథోడ్, ఉస్మానియా జేయేసి నాయకులు దుర్గం భాస్కర్ జిల్లాలోని ప్రజాఉద్యమకారులు పాల్గొంటారని తెలిపారు. గద్దర్ సంస్మరణ సభకు అన్ని వర్గాల ప్రజలు, సింగరేణి బిడ్డలు హాజరుకావాలని కోరారు. సంస్మరణ సభ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత్ బచావో జిల్లా చైర్మెన్ కనుకుంట్ల మల్లయ్య, బీసీ ఐక్య వేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సింగరేణి బీసీ సంఘర్షణ సమితి నాయకులు సమ్ము రాజన్న, మాడిశెట్టి విశ్వం, నూతన్ కుమార్ పాల్గొన్నారు.

13న చలో ప్రగతిభవన్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై అక్టోబర్ 13న నిర్వహించనున్న చలో ప్రగతి భవన్‌ను విజయవంతం చేయాలని కాంట్రాక్టు లేబర్ యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పేరం రమేష్ అన్నారు. బుధవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సింగరేణి అధికారులు, పర్మినెంట్ కార్మికుల వేతనాలు పెరుగుతున్నా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు ఎందుకు పెంచరని ప్రశ్నించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత, లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ఉందని, కానీ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల సింగరేణి వివక్షత చూపుతోందని ఆరోపించారు. ప్రతి డిపార్ట్మెంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, కాంట్రాక్ట్ కార్మికులు లేకుండా సింగరేణి ఒక్కరోజు కూడా నడవదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించడం లేదని, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మిట్ చేయాలని, సామాజిక, ఉద్యోగ భద్రత కల్పించాలని, సింగరేణి లాభాల్లో వాటా కల్పించాలని, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలనే డిమాండ్లతో చలో ప్రగతి భవన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి మిట్టపల్లి మొగిలి, సత్రం రమేష్, కొండ వెంకటేష్, పొడిశెట్టి వినోద్ కుమార్, అంబాల సాగర్, రణవేణి శ్రీనివాస్, బద్రి శ్రీకాంత్, అరవెల్లి రవీందర్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు సూది మందులు ఇవ్వొద్దు

- డీఎంఅండ్‌హెచ్‌ఓ సుబ్బారాయుడు



నవతెలంగాణ - మంచిర్యాల

అర్ఎంపీ, పీఎంపీలు సూది మందులు ఇవ్వరాదని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సుబ్బారాయుడు అన్నారు. ప్రైవేట్ వైద్యులపై వచ్చిన ఫిర్యాదుతో కలెక్టర్ ఆదేశాలతో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆర్ఎంపీ, పీఎంపీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుబ్బారాయుడు మాట్లాడుతూ ఆర్ఎంపీలు వారి వద్దకు వైద్యం కోసం వచ్చే రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తూ 30 నుండి 40శాతం కమీషన్ తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా వారికి తగు సూచనలు చేశారు. ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే బోర్డు పెట్టాలన్నారు. వారి పేరు ముందు డాక్టర్ అనే పదం ఉండకూడదన్నారు. యాంటీ బయోటిక్స్ మందులు రోగులకు వేయరాదన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు రెఫర్ చేయరాదని తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేలా సూచించాలని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల వ్యయాన్ని పరిశీలించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నికల వ్యయాన్ని పరిశీలించి నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల ఖర్చును పరిశీలన జరిపేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎప్పటికప్పుడు ఎన్నికల వ్యయ వివరాలను తెలియజేయాల్సి ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చొరవ చూపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. పోటీ చేసే అభ్యర్థులు, వారికీ మద్దతు తెలిపే వారు తమ పేరును ఓటరు జాబితాలో పరిశీలించుకోవాలని, లేనట్లయితే వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణ కోసం కనీసం 48 గంటల ముందు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1950కు ఫిర్యాదు చేయవచ్చని, సీ-విజిల్ యాప్ ద్వారా లైవ్ ఫోటోలు, వీడియోల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో శిక్షణ సహయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీఓ స్రవంతి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నిల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ సాధించడమే కేసీఆర్ లక్ష్యం



నవతెలంగాణ-కడెం

బంగారు తెలంగాణ సాధించడమే కేసీఆర్ లక్ష్యమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని మారుమూల ప్రాంతాలైన అల్లంపల్లి, చింతగూడ, కాశీరామ్‌తండా, బాబానాయక్ తండా, గంగన్నపేట్, పాలరేగడి, గుర్రం మధుర తదితర గ్రామాల్లో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అల్లంపల్లి చుట్టు పక్కల గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామల ప్రజలు జాన్సన్ నాయక్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కబ్జాలో ఉన్న భూములను పేదలకు పంపిణీ చేస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కబ్జా కోరల్లో చిక్కుకున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామని ఆ పార్టీ నాయకులు, ఎన్నారై కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వార్డు నెంబర్ 8 కేఆర్‌కే కాలనీ వాసులు శ్రీరామ్ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి కంది శ్రీనివాసరెడ్డి ఆహ్వానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అధికారంలోకి రాగానే కబ్జాకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని, ఇండ్లు లేని నిరుపేదలకు పంపిణీ చేస్తామని కంది శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జోగు రామన్న అనుచరులే భూములన్నింటినీ ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అవినీతి, అక్రమాల్లో మునిగి తెలుతున్న జోగు రామన్నను ఓడించేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్, ఎమ్మెల్యే జోగు రామన్న ఇద్దరూ ఒక్కటేనని, వారిద్దరిలో ఎవరికీ ఓటువేసిన మళ్లీ అభివృద్ధికి ఆటంకం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షులు ముడుపు దామోదర్ రెడ్డి, సీనియర్ నాయకులు భరత్ వాగ్మారే, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మెన్ సెడ్మాకి ఆనంద్ రావు, బనేని సంతోష్‌రావు, నాగర్కర్ శంకర్, షకీల్, సుజాత్ అలీ, తిరుమల్ రెడ్డి, కొండూరి రవి ఉన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



కాంగ్రెస్ ఆరు గ్యారంటీ కార్డులను విడుదల చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీంలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీముల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, యువ వికాసం, చేయూత గ్యారెంటీ స్కీములను అమలు చేసి పేద ప్రజలను ఆదుకుంటామన్నారు. జన్నారంలో కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలు లేవన్నారు అందరూ కాంగ్రెస్ పార్టీ జెండా కింద పనిచేసి అభ్యర్థిని గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే జన్నారం పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. కిడ్నీ రోగుల కోసం డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేస్తామన్నారు. మండల, గ్రామ నాయకులు కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, ఏనుగు సుభాష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముసాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, నాయకులు రాజశేఖర్, దాముఖ కరుణాకర్, ఏబీఆర్ రవి నాయక్, మచ్చ శంకరయ్య, ఫసియుల్లా, మహమ్మద్ అజారుద్దీన్, దుమల రమేష్, ఇంద్రయ్య, ఎన్ఎస్‌బిఐ రాష్ట్ర నాయకులు సొహెల్ పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

దస్తురాబాద్ : మండలంలోని మున్యాలతండా గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న అజ్మీరా రవిపై కేసు నమోదు చేశామని ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సమాచారం మేరకు బుధవారం తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టి 25లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామన్నారు. గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదువుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదువుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ముచ్చ స్వామి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం బీఏ చదువుతున్న వకీల్ అగ్నివీర్‌లో ఎంపికైన సందర్భంగా బుధవారం కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే ఉద్యోగ సాధన కోసం పట్టుపట్టి ఆ దిశగా చదువుకోవాలన్నారు. క్రీడల్లోనూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జాడి రవికిరణ్, డాక్టర్ సంగీత, డాక్టర్ శ్రావణి, రవీందర్, శ్రీనివాస్, జావిద్, దేవన్న, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్



మండలానికి చెందిన సాదుల చంద్రయ్య(57) ఉరేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో ఉరేసుకున్నాడు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నవతెలంగాణ 2
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | అక్టోబర్ 12, 2023 | www.navatelangana.com

హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలం

నవతెలంగాణ-దస్తురాబాద్



హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు సతీష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం రేవోజీపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు దొంగ హామీలన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎంబడి గోవర్ధన్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-పెంబి



మండలంలోని మారుమూల తండాలో డాక్టర్ రమేష్ రెడ్డి, తిరుమల నర్సింగ్ హోం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కనీస ప్రయాణ సౌకర్యం లేని మారుమూల గిరిజన గ్రామమైన పస్పుల గ్రామ తండాలో ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలందించారు. జ్వరం, ఇతర వ్యాధులతో బాధపడుతున్న 92 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, మద్యపాన నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల కృష్ణ, డాక్టర్ శివకుమార్, సిబ్బంది లక్ష్మణ్, రాము, గీత, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ దాడుల్లో పట్టుబడ్డ అక్రమ మద్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి, కచ్‌కంటి, తంతోలితో పాటు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అంకోలి గ్రామంలో ఇంటి వద్ద అక్రమ మద్యం విక్రయిస్తున్న గంగమ్మ, కచ్‌కంటిలో నరసయ్యను పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై సంజీవ్ కుమార్, సిబ్బంది నానక్‌సింగ్, శ్రీధర్, హనుమంతు, లతా, సంధ్య ఉన్నారు.

బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు కొత్తగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయురాలు సంగీతను బుధవారం గ్రామస్తులు శాలువతో సన్మానించారు. గతంలో పనిచేసిన దిలీప్ రెడ్డికి వీడ్కోలు పలికి, ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ కొప్పుల రజిత గంగన్న మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసేల బోధనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కే.మహేందర్ యాదవ్, అశోక్, జయంత్, ఉపాధ్యాయులు సాగర్, ఆనంద్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

19న ద్విచక్రవాహనాలకు వేలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలకు 19న వేలంపాట నిర్వహిస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి హిమశ్రీ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించనునట్లు తెలిపారు. ఆసక్తిగల వారు నిర్దేశించబడిన ధారావతు సొమ్మును చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని 31 మందిని డాక్టర్ రాంబాబు పరీక్షించారు. నాగల్‌కొండ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల గర్భిణీలకు రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని ఈ సందర్భంగా వైద్యులు సూచించారు. ఈ క్యాంపులో హెల్త్‌సూపర్ వైజర్ చౌహాన్ చరణ్ దాస్, సీహెచ్‌ఓ లక్ష్మి, వైద్య సిబ్బంది సుశీల, సత్తవ్వ, రవీందర్, మాన్కుబాయి ఉన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్



నవతెలంగాణ-ఖానాపూర్

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు అర్ధాంతరంగా నిలిచిపోయిందన్నారు. ఈ సందర్భంలో కనీసం బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను బదిలీ చేయాలన్నారు. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు, కొందరి వ్యక్తిగత స్వార్థం కారణంగా బదిలీలు, పదోన్నతులు నిలిచిపోయని, విద్యారంగంలో సంక్షోభం ఏర్పడిందని ఆరోపించారు. దీని కారణంగా పేద విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగుతుందనని ఆవేధన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గురుకులాల కన్వీనర్ అనిల్ కుమార్, రాజు, సుచిత్ర పాల్గొన్నారు.

అమిత్‌షా చెప్పినవన్నీ అబద్ధాలే

- ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



ఆదిలాబాద్ పర్యటనలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడిన మాటలు అబద్ధాలేనని, ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీఐ విషయంలో గతంలో ఇచ్చిన హామీలను విస్మరించడమే కాకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా అమిత్ షా మాట్లాడారని మండిపడ్డారు. అమిత్ షా వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. సీసీఐ పునరుద్ధరణ విషయంలో గతంలో అనేక మార్లు కేంద్ర మంత్రులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించినా కేంద్రం స్పందించలేదని విమర్శించారు. ఈ నియోజకవర్గంలో తమ పార్టీ ఎంపీని గెలిపిస్తే సీసీఐని పున:ప్రారంభిస్తామని ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసిన కేంద్రం నుండి మాత్రం స్పందన కరువైందన్నారు. స్థానిక బీజేపీ నాయకులు మాత్రం అబద్ధాలు, అసత్య ప్రచారాలతో పబ్బం గడుపుకుంటున్నారన్నారు. సీసీఐ భూ నిర్వాసితులకు సైతం బూటకపు హామీలు ఇచ్చారన్నారు. సీసీఐని తెరిపించే ఆలోచనే ఉంటే తుక్కు కింద సామగ్రిని అమ్మాలని టెండర్లలను ఎందుకు పిలిచారని ప్రశ్నించారు. సీసీఐ ప్రారంభిస్తే ఎక్కడ బీఆర్ఎస్‌కు క్రెడిట్ దక్కుతుందోననే దురుద్దేశంతోనే ఫ్యాక్టరీ అంశాన్ని కేంద్రం పక్కకు పెట్టిందనన్నారు. తాము ఆదివాసీలకు ఆర్ఓఎఫ్ఆర్ కింద పట్టాలు అందించడమే కాకుండా వారి సంక్షేమం కోసం పాటు పడుతున్నామని వివరించారు. సీఎం కేసీఆర్ ఆరోగ్యం గురించి మానవత్వం లేకుండా వ్యాఖ్యనిచడాన్ని తప్పుపట్టారు. సీఎం తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తర్వాత రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లారని వివరించారు. ఏ అర్హత ఉందని అమిత్ షా కుమారుడు జయ్‌షాకు బీసీసీఐ సెక్రటరీ పదవీ ఇచ్చారని ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ హామీల అమలుపై సైతం ప్రజలకు నమ్మకం లేదన్న ఎమ్మెల్యే హామీల అమలులో విఫలమైన బీజేపీ నాయకుల ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఇజ్జగిరి నారాయణ, అధికార ప్రతినిధి గంగారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, పట్టణ అధ్యక్షులు అజయ్, సలీం పాషా, కుమ్ర రాజు, రాజన్న పాల్గొన్నారు.

పోలీస్‌ల పిల్లలకు గ్రంథాలయం ఏర్పాటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో పనిచేసే పోలీసులు నిరంతరం విధులను నిర్వహిస్తూ పిల్లల భవిష్యత్తుపై అశ్రద్ధ వహించడం ఎంత మాత్రం సమాంజసం కాదని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో పోలీస్ ఉద్యోగస్తుల పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి తోడ్పడేలా జిల్లా పోలీసు యంత్రాంగం తరపున పోటీ పరీక్షలకు సంసిద్ధమయ్యేలా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ గ్రంథాలయం ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. గ్రంథాలయంలో పుస్తకాలన్నింటిని ఏర్పాటు చేసి పిల్లలకు అన్ని రకాల సదుపాలయాలను కల్పిస్తున్నామన్నారు. చదువు ప్రాముఖ్యతను తమ తర్వాత తరాలకు తెలియజేస్తూ చిన్న తనం నుండే పిల్లలకు విద్యపై ఇష్టాన్ని పెంపొందించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కసారి జ్ఞానాన్ని సంపాదించిన తర్వాత అది జీవితంలో మనల్ని విడిచిపెట్టి పోదనే విషయాన్ని గుర్తు చేశారు. పోలీసు పిల్లల ఆవశ్యకతను గుర్తించి భవిష్యత్తులో హైదరాబాద్ నుండి నిష్ణాతులైన సిబ్బంది ద్వారా శిక్షణ తరగతులను ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు ఆదిలాబాద్ జిల్లా నుండి పోలీసుల పిల్లలు ఎంపిక అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ క్వార్టర్ ఆర్ఐ నవీన్ కుమార్, ట్రాఫిక్ సీఐ, స్పెషల్ పార్టీ, క్యూఆర్టీ, పోలీసు పిల్లలు పాల్గొన్నారు.

ఎంసెట్, నీట్ కోసం విద్యార్థులను సిద్ధం చేయాలి

- డీఐఈఓ పరుశురాం

నవతెలంగాణ-దిలావర్‌పూర్



ఇంటర్ వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు, ఎంసెట్, నీట్ ర్యాంకులే లక్ష్యంగా కృషి చేయాలని ఇంటర్మీడియట్ విద్యాధికారి జాదవ్ పరశురాం అధ్యాపకులు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతు అకాడమిక్ పాఠ్య పుస్తకాలను నిశితంగా చదవాలని, ప్రతిరోజు కళాశాలకు హాజరుకావాలని సూచించారు. హాజరు శాతం 75శాతం కంటే తక్కువగా ఉన్న విద్యార్థులు వార్షిక పరీక్షలకు అనుమతించబడరని పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సిలబస్‌పై ఆరా తీసారు. సైన్స్, వోకేషనల్, ప్రాక్టికల్స్, యూనిట్ టెస్ట్ ఫలితాలపై రివ్యూ చేశారు. హాజరు శాతం పెంచే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్, స్వయంగా విద్యార్థుల ఇండ్లకు వెళ్లి హాజరు అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. ఎంసెట్, నీట్ పరీక్ష కోసం విద్యార్థులను సంసిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కందూరి శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జోగు రామన్న పతనం మొదలైంది

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

సిట్టింగ్ ఎమ్మెల్యే జోగు రామన్న పతనం మొదలైందని బిజెపి జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు . బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జోగు రామన్నపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జన గర్జన సభ విజయవంతం అయిందని, దీంతో జోగు రామన్నకు ఓటమి భయం పట్టుకుందని తెలిపారు. డిసెంబర్ 3న ప్రకటించనున్న ఎన్నికల ఫలితాలలో బిజెపి విజయ దుందుభి మోగిస్తుందని జోస్యం చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన అనంతరం తొలుత ఆదిలాబాద్ గడ్డ నుంచే తమ పార్టీ శంఖారావం పూరించిందని పేర్కొన్నారు. జన గర్జన సభకు వచ్చిన స్పందనను చూస్తే అప్పుడే బిజెపి ఆదిలాబాద్‌లో అధికారాన్ని కైవసం చేసుకుందని అనిపించిందన్నారు. వారం రోజులుగా కార్యకర్తలు, నాయకులు అహర్నిశలు శ్రమించి సభను విజయవంతం చేశారని, అందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి అంటే ఏంటో ఆదిలాబాద్ ప్రజలకు చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త రామన్నను, బీఆర్ఎస్ పార్టీని ఓడించడానికి కంకణం కట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోయరు విజయ్, జోగు రవి, లోక ప్రవీణ్‌రెడ్డి. రాందాస్, ఆకుల ప్రవీణ్, వ్యాస్ ముకుందరావు, కృష్ణ, రఘుపతి, గొర్ల రాము పాల్గొన్నారు.

కిర్గుల్ గ్రామ సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- మాల మహార్ సంక్షేమ సంఘం డిమాండ్

నవతెలంగాణ-తలమడుగు



దళిత మహిళల కడుపులో కొట్టిన బాసర మండలం కిర్గుల్ గ్రామపంచాయతీ సర్పంచ్ దేవేందర్‌పై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల మహా సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిర్గుల్ గ్రామ సంఘటనలో గ్రామ సర్పంచ్ దేవేందర్ మహిళలని చూడకుండా ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సమీక్షంలో తన్నడం హేయమైన చర్య అని, ఆయనపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్‌లు కేసు నమోదు చేసి దళితులకు రక్షణ కల్పాలించాలన్నారు. బాధ్యతగల సర్పంచ్ రుణ మంజూరులో అక్రమాలకు పాల్పడితే నిలదీసినందుకు దళిత మహిళలని చూడకుండా కడుపులో తన్నడం సిగ్గుచేటన్నారు. ఇందులో సంఘం నాయకులు నేతుల గంగన్న, దేవన్న, కాడే శ్రీనివాస్, లింగాల దేవన్న, ముత్యాల రవి, కాడే సుధాకర్, సూర్య ప్రకాష్, భూమన్న, బోనాల మల్లేష్, శశివర్ధన్, చంటి, రమకాంత్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన



నవ తెలంగాణ-సారంగాపూర్

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. బుధవారం మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్ అని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా 2014లో సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. పార్టీకి రోజు రోజుకు ప్రజాదరణ పెరుగుతోందని, రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు.

నవంబర్ 1 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్స్ ట్రెనింగ్ కొత్త బ్యాచ్ నవంబర్ ఒకటి నుండి ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు హెవీ మోటార్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి ఆదిలాబాద్ డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ ట్రెనింగ్ 30 రోజులు ఉంటుందని, ఫీజు రూ.15,600 చెల్లించాలన్నారు. లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్ జి విష్ణు, యూసుఫ్, సెల్ ఫోన్ నెంబర్ 7382840166, 7382840349లో సంప్రదించాలని సూచించారు.

చిన్నయ్య కుటుంబానికి కార్మిక సంఘం చేయూత



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

పురపాలక శాఖలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహించిన గొంటిముక్కల చిన్నయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు చేయూత ఇచ్చారు. మృతుని భార్యకు రూ.14,160 ఆర్థిక సాయం అందించారు. ఆ సంఘం అధ్యక్షుడు దర్శనాల నాగేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు డబ్బులు వేసుకొని ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రాజేశ్వర్, చిరంజీవి, శంకర్, ఆనంద్, కాంతారావు, ఉషన్న పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మెడికల్ క్యాంప్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో ఆయూష్ వికాస్ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ, రిమ్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సుతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస స్వామి సీనియర్ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ వాణి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య కరదీపికలు పంపిణీ చేశారు. వీటిని ఉపయోగించడం, ఆయుర్వేద చిట్కాలు యోగాసనాలు గురించి వివరించారు. అనంతరం ఆయుర్వేద జలుబు, దగ్గు వంటి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ గ్యారంటీ పథకాలు



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని భుక్తాపూర్ కాలనీ(వార్డ్ 45)లో ఆరు గ్యారెంటీ పథకాలతో గడపగడపకు తీసుకెళ్లారు. బుధవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను అందించారు. వంట గ్యాస్ రూ.500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చేయూత కింద వృద్ధులకు రూ.4వేలు, మహిళలకు రూ.2,500 పెన్షన్, ఐదు లక్షల రూపాయలతో గృహలక్ష్మి పథకం వంటి వాటి గురించి వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి సంతకం ఈ ఆరుగ్యారంటీలపైనే చేస్తుందని నాయకులు తెలిపారు. కొత్త కుమ్మరివాడ, ధన్‌పూర్ గల్లిలో ఆరు గ్యారంటీ పథకాలను గడపగడపకు వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లస్మారెడ్డి, నగేష్, మోతీరాం, రిజ్వాన్, వసీమ్, నాందేవ్, శివాజీ, సాదిక్, సంతోష్, హనీఫ్, అన్వర్, నసీం, గంద్రత్ వెంకటి, శకిర్, బషీర్, అఖిల్, మినాజ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | అక్టోబర్ 12, 2023 | www.navatelangana.com

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు

నవతెలంగాణ-సిర్పూర్(టీ)



రాష్ట్రంలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న హుడ్కిళి, వెంకట్‌రావ్‌పేట్ గ్రామాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, డబ్బు, మద్యం, మత్తు పానియాలు తదితర వస్తువులను ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణలోకి అక్రమ రవాణ కాకుండా ఈ చెక్‌పోస్టులను ఏర్పాటుచేసినట్లు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. బుధవారం చెక్‌పోస్టుల వద్ద సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన సీజీజీ బృందం

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని బుధవారం సీజీజీ సెంటర్ ఫర్ గుడ్ గవర్నమెంట్ ప్రతినిధులు వి దేవీసింగ్(సీనియర్ నాలెడ్జ్ మేనేజర్) సందర్శించారు. గ్రంథాలయంలో చదువుకోవడానికి వస్తున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన యువతి, యువకుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. సింగరేణి ఇచ్చిన పోలీస్ శిక్షణ, కల్పించిన వసతులు, ప్రోత్సాహం గురించి యువతి, యువకులకు సీజీజీ ప్రతినిధి దేవీసింగ్‌కు క్లుప్తంగా వివరించారు.

కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-చింతలమానెపల్లి

విద్యార్థులకు తప్పని సరిగా మెను ప్రకారం భోజనం అందించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించిన అనంతరం పాఠశాల ఆవరణతో పాటు తరగతి గదులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు అనారోగ్యం పాలైతే వెంటనే ఆసుపత్రి తీసుకెళ్లి వైద్యం అందించాలని అన్నారు. ఆయన వెంట మన ఊరు మన బడి కోఆర్డినేటర్ భరత్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, మండల విద్యాధికారి సోమయ్య, ఎస్ఓ శ్రీజ, నందిని, జైరాజ్ ఉన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



నవతెలంగాణ-రెబ్బెన

అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) కుమురంభీం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్టు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెనిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గం రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా బాలునాయక్, ఉపాధ్యక్షుడిగా పర్వతి సాయి, కార్యదర్శిగా పూదరి సాయి, సహాయ కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా జాడి సాయిలను ఎన్నుకున్నట్టు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై నూతన నాయకత్వం పోరాడేందుకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రతి మండలంలో నూతన కమిటీలను ఎన్నుకోవాలని వారు తెలిపారు.

పోలీసులకు సహకరించాలి

నవతెలంగాణ-వాంకిడి

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నియమావళి ప్రారంభించడంతో మండలకేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద పోలీస్ చెక్‌పోస్టు కేంద్రాన్ని ఏర్పాటుచేయడం జరిగిందని ఎస్సై సాగర్ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి, ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందని, దీనికోసం పోలీసులకు ప్రజలు సహకరించాలని తెలిపారు. ఎక్కువ మొత్తంలో వాహనాల్లో డబ్బులు తరలించే అవకాశాలున్నాయని, రూ.50 వేల కంటే డబ్బులు ఎక్కువ ఉన్నట్టయితే దానికి సంబంధించిన వివరాలను అందించాలని, సరైన ధృవీకరణ పత్రాలు లేనిపక్షంలో డబ్బులు సీజ్ చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

బీఎస్పీ టౌన్ ఇన్‌ఛార్జి నియామకం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బహుజన సమాజ్ పార్టీ కాగజ్‌నగర్ టౌన్ ఇన్‌ఛార్జిగా మాజీ కౌన్సిలర్ షబ్బీర్‌హుస్సేన్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. అదేవిధంగా కార్యదర్శిగా సిద్దం శ్రీనివాస్, సిర్పూరు రూరల్ కార్యదర్శిగా ఎంపీటీసీ మంగీలాల్, సిర్పూరు అర్బన్ కార్యదర్శిగా రాజు నగరాడెను నియమిస్తూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేసినట్లు టౌన్ ఇన్‌ఛార్జి షబ్బీర్‌హుస్సేన్ తెలిపారు.

పలువురు చేరిక

కాగా బుధవారం పలు పార్టీల నుండి నేతలు, కార్యకర్తలు బీఎస్పీలో చేరారు. వీరికి టౌన్ నాయకులు కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

మండలంలో కొనసాగుతున్న (వర్షవాత్) గ్రంథపఠనం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన, వాంకిడి బుద్ధవిహార్‌లలో వర్షవాత్ గ్రంథపఠనం కొనసాగుతోంది. ఇందులో భాగంగా మండలకేంద్రంలో 11 సంవత్సరాల నుంచి జశ్వంత్ బుద్ధవిహార్‌లో ప్రతిరోజు సాయంత్రం గ్రంథపఠనాన్ని నిర్వహిస్తున్నారు. గ్రంథపఠనానికి ప్రతిరోజు బౌద్ధ ఉపాసకులు అధిక సంఖ్యలో పాల్గొంటుంటారు. దీనిని దసరా పండుగ వరకు నిర్వహించడం జరుగుతుందని అంబేద్కర్ సంఘం నాయకులు విజయ్ తెలిపారు.

మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష దరఖాస్తు గడువుపెంపు

ఆసిఫాబాద్ : జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత కోసం నిర్వహించే పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్లు జిల్లా విద్యాధికారి అశోక్ ఒక ప్రకటనలు పేర్కొన్నారు. ఈనెల31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనికోసం //హెచ్‌టీటీపీ//బీఎస్ఈ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ సంప్రదించాలని పేర్కొన్నారు.

బాలికలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్
- జిల్లా కేంద్రంలో ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వాలు బాలికలకు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బాలికల గిరిజన గురుకులంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఏ విషయంలో కూడా తక్కువ చేసుకోకూడదని అన్నారు. ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని కష్టపడాల్సి ఉంటుందన్నారు. దాని కోసం ఎంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం బాలిక వరకు అనేక వసతులు కల్పించడానికి ముందుకు వచ్చిందని వాటిని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. బాలికల పట్ల లైంగిక వేధింపులు జరగకుండా బాల్యవివాహాలు నిరోధించే విధంగా ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పారామెడికల్ వాలంటీర్ జయరాజ్, అసిస్టంట్ డిఫెన్స్ కౌన్సిల్ అంజనీదేవి, ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.



బాలికల దినోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్

విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సిర్పూర్(టి) : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై దీకొండ రమేష్ అన్నారు. బుధవారం తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల కాగజ్‌నగర్ గురకుల విద్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు కేవలం నాయకులకు, పోలీసులకే పరిమితమై ఉంటాయని అనుకుంటారని, కాని భారత రాజ్యాంగం స్త్రీ, పురుషుల బేదం లేకుండా చట్టాలతో మానవుని జీవితం ముడిపడి ఉందనే విషయాన్ని అర్థం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే తపన ఉండాలని, కలలుకని వాటిని సాకారం చేసుకోవాలని, దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మాణం ఉంటుందని పెద్దలసూక్తులను నిజం చేయాలని సూచించారు. సమాజంలో మహిళలపై జరిగే ఆకృత్యాలను నివారించాలంటే ప్రతి ఒక్కరు రాజ్యాంగం కల్పించిన చట్టాలపై అవగాహన ఉంటే వాటిని అరికట్టవచ్చని, విద్యార్థి దశంటే విద్యతో పాటు అన్ని విషయాలను అధ్యాయనం చేయడమే దీని అర్థమన్నారు. బాలబాలికలు చట్టాలతో మాకు ఏం పనిలేదని అనుకొనే భావన కలిగి ఉండొద్దన్నారు. ప్రతి ఒక్కరు చట్టాలపై విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని ఆయన సూచించారు. అనంతరం పారాలీగల్ రుటైనర్ జనత కళ్యాణ్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే విద్యాలయాల్లో బాలికలపై జరిగే ఆకృత్యాలను నివారించవచ్చని, మహిళలు పురుషులతో సమానంగా చట్టసభల్లో సమానంగా హక్కు కలిగి ఉండాలని, ప్రభుత్వం పార్లమెంట్ సమావేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను కల్పించిందని గుర్తుచేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంగీత, పారాలీగల్ వాలంటరీ వనమాల, కోర్టు క్లర్కు రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి) సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై రమేష్

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలుచేస్తాం

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్

నవతెలంగాణ-దహెగాం

ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలుచేస్తామని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌తో పాటు కల్వాడ వద్ద ఏర్పాటుచేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. మద్యం, డబ్బు పంపిణీకి పాల్పడినట్టయితే పరినామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీలను చేపట్టాలని పోలీసులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామాల్లో నగదు, మద్యం పంపిణీలపై ప్రత్యేక నిగా ఉంటుందని, మాడల్ కోడ్ అమల్లోకి వచ్చినందున ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తంలో తీసుకెళ్లే వారు, పెద్దమొత్తంలో బంగారం, ఇతర వస్తువులను తీసుకెళ్లే వారు ఆధారాలను చూపాలని, లేనిపక్షంలో వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోబ పెట్టడం, చేయడం చేస్తే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సనత్‌కుమార్ పాల్గొన్నారు.



బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ సురేష్‌కుమార్



దహెగాంలో చెక్‌పోస్టును సందర్శించిన ఎస్పీ

దహెగాం, బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌ల ఆకస్మిక తనిఖీ

బెజ్జూర్ : ఆసిఫాబాద్ ఎస్పీ కె సురేష్‌కుమార్ దహెగాం, బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయా పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ విధులకు సంబంధించిన సూచనలు చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దహెగాం ఎస్సై సనత్‌కుమార్, బెజ్జూర్ ఎస్సై విక్రమ్‌కు ఎలక్షన్‌కు సంబంధించిన తగు సూచనలు చేశారు. ఎల్లవేళల ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుపై సత్వరమే స్పందించి సేవలందించాలని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఆర్థిక నేరాలను కట్టడి చేయడానికి కాలనీల్లో సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ కరుణాకర్, సీఐ నాగరాజు పాల్గొన్నారు.

అధికారులు ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఎన్నికల నేపథ్యంలో అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆదనపు ఎస్పీ అచ్చేశ్వర్ రావు తో కలిసి నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లాలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ విజయవంతం చేసే విధంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 9న ఎన్నికల కార్యచరణ ప్రకటించినందున ఎన్నికల నియామవళి అమలులోకి వచ్చిందని, శిక్షణ నిర్వహణలో భాగంగా ఎన్నికల కార్యకలాపాలలో పాల్గొనే అధికారుల సామర్థ్యం పెంపుదల, శిక్షణ, వేదికల ఏర్పాట్లు, సామాగ్రి పంపిణీ, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సామాగ్రి ఫారంలు, బ్యాలెట్ పత్రాలు, చెరగని ఇంక్, ఇతర ఎన్నికల సామాగ్రి సేకరణ, పంపిణీ చేయాలని, రవాణా నిర్వహణలో భాగంగా ఎన్నికలలో ఉపయోగించాల్సిన అన్ని రకాల రవాణా అవసరాలు, లభ్యత, కొరత ఏర్పడినప్పుడు ఇతర జిల్లాల నుండి సర్దుబాటు, జిల్లాలో కేటాయింపు చర్యలు తీసుకోవాలన్నారు. కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీలో భాగంగా సైబర్ సెక్యూరిటీ నిబంధనలకు అనుగుణంగా జిల్లా వెబ్‌సైట్ నవీకరణ, సీఐటీ పనితీరు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పర్యవేక్షణ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు, సాంకేతిక మద్దతు అందించడం జరుగుతుందన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల లభ్యత, పంపిణీ, మొదటి స్థాయి తనిఖీ ర్యాండమైజేషన్ వంటి వివిధ కార్యకలాపాల కోసం కార్యచరణ రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికారులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, మీడియా మొదలైన వాటి కార్యకలాపాలపై ప్రతి రోజు నివేదికను రూపొందించడం, సీ-విజిల్ ఫిర్యాదులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఖర్చుల పర్యవేక్షణలో భాగంగా రాజకీయ పార్టీల అభ్యర్థుల వ్యయ పర్యవేక్షణ, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల వ్యయ పర్యవేక్షణపై శిక్షణ, జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, ఇతర నోడల్ అధికారుల సమన్వయంతో నివేదికలు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. బ్యాలెట్స్ పోస్టల్ బ్యాలెట్‌ల నిర్వహణలో భాగంగా బ్యాలెట్ పేపర్, డమ్మీ బ్యాలెట్ షీట్, బ్రెయిలీ బ్యాలెట్ ముద్రణ, ప్రింటింగ్ ప్రెస్, అసెంబ్లీ నియోజకవర్గాలలో పంపిణీ సంబంధిత అంశాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. జిల్లాలోని ఓటరు హెల్ప్‌లైన్ 1950 నిర్వహణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నియమాలను పకడ్బందీగా అమలు చేస్తూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయు జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్‌లో ఆశా కార్యకర్తల జిల్లా విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యలపై హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఆశా యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీతో జరిపిన చర్చల్లో 18 డిమాండ్ల పరిష్కారాలపై ఇచ్చిన హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఇదే పోరాట స్ఫూర్తి భవిష్యత్‌లో కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వరూప, పద్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, భారతి, నవీన, ఓమల, సక్రుబాయ్, కవిత, గీత కుమారి పాల్గొన్నారు.

'మా గోడు ఎవరికి చెప్పుకోవాలి'

- విద్యుత్ కార్యాలయం ముందు రైతుల ధర్నా



నవతెలంగాణ-కౌటాల

విద్యుత్ సరఫరాలో నిరంతరం అంతరాయం కలగడంతో కౌటాల విద్యుత్ శాఖ అధికారి రవీందర్‌ను కలవడానికి వస్తే అందుబాటులో లేక ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ పెట్టుకుంటున్నాడని, మా గోడు ఎవరికి చెప్పుకోవాలని రైతులు ఆవేధన వ్యక్తం చేశారు. బుధవారం సబ్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించిన నిరసన తెలిపారు. తాళ్లపెల్లి తిరుపతి గౌడ్ మాట్లాడుతూ గతంలో విద్యుత్ వారోత్సవాల్లో గుండాయిపేట్ ఉప కేంద్రం నుంచి విద్యుత్ లోడ్ ఎక్కువ పడుతుందని రోజుకు నాలుగు గంటలే కరెంటు ఇవ్వడంతో పంటలు ఎండిపోతున్నాయని, ఎన్నిసార్లు విన్నవించిన ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవాంర విద్యుత్ కేంద్రానికి వస్తే ఏఈ స్పందించకపోవడంతో రైతులందరం కలిసి నిరసన తెలిపామన్నారు. ఎలక్షన్ కోడ్ వచ్చినప్పటి నుంచి పగలైతే కరెంటే ఉండటం లేదన్నారు. రాత్రి రెండు, మూడు గంటలే సరఫరా ఇస్తున్నారని, మరమ్మత్తుల పేరుతో రోజుల తరబడి విద్యుత్ సరఫరా ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపడుతున్న సమ్మె బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు సమ్మె చేపడుతున్నారు. నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ ఆయా ఖాతాలలో జమ చేయాలని వారు డిమాండ్ చేస్తూ సమ్మె చేపడుతున్న విషయం తెల్సిందే.

కంపెనీ స్థాయి పోటీ విజేతలేగా బెల్లంపల్లి, మందమర్రి జట్లు



నవవతెలంగాణ-రెబ్బెన

మనుగూర్‌లో బుధవారం జరిగిన కంపెనీ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలో బెల్లంపల్లి, మందమర్రి జట్టు విజేతగా నిలిచాయి. ఆర్జీ(3) భూపాలపల్లి జట్టుపై 31-35,. 35-29, 35-26 ఆధిక్యంతో బెల్లంపల్లి, మందమర్రి జట్టు గెలుపొందాయి. కంపెనీ స్థాయిలో ప్రతిభ కనబరిచిన సింగరేణి ఉద్యోగ క్రీడాకారులను బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ అభినందించారు. కోలిండియాలో జరిగే పోటీల్లో గెలుపొందాలని సూచించార

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-కౌటాల

రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఈసీ ఆదేశాల మేరకు ఎలక్షన్ కోసం పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారి భానుమూర్తి బుధవారం పరిశీలించారు. మండలంలోని వీర్దండి, మొగడ్‌దగడ్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి తగు వసతులను కల్పించడం కోసం నమోదు చేసుకున్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-భీమారం



నిరుపేద కుటుంబానికి చెందిన చెవుల సారక్క ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నల్లాల ఓదెలు బుధవారం పరామర్శించారు. మండలంలోని మద్దికల్ గ్రామానికి చెందిన చెవుల రమేష్ భార్య సారక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆ కుటుంబం దినసరి కూలీ పనులపై ఆధార పడి రోజు గడిచే పరిస్థితి ఉండటంతో వారికి దిన కర్మల కోసం ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం నరేష్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

మండల విద్యార్థికి జాతీయ ఇన్‌స్పైర్ అవార్డు

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మని ప్రసాద్‌కు బుధవారం జాతీయ ఇన్‌స్పైర్ అవార్డు లభించింది. మూడు రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న పదవ జాతీయ ఇన్‌స్పైర్ పోటీల్లో పాల్గొని మని ప్రసాద్ అవార్డును కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి జితేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మని ప్రసాద్‌గైడ్ ఉపాధ్యాయుడు ఎస్.సురేందర్ మాట్లాడుతూ తన సహాయంతో తయారుచేసిన గ్రీన్ ప్రొటెక్టర్ ఫ్రొం రైన్ అండ్ అనిమల్స్‌కు గాను జాతీయ అత్యుత్తమ ఇన్‌స్పైర్ అవార్డు వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా డీఈఓ యాదయ్య మాట్లాడుతూ అన్నారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గైడ్ ఉపాధ్యాయుడు అలాగే అవార్డు గ్రహీత మని ప్రసాద్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి విద్యార్థి మని ప్రసాద్ బాటలో నడిచి మరెన్నో అవార్డులు పొందాలని అన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే ఇన్కమ్ టాక్స్ రద్దు

నవతెలంగాణ-మంచిర్యాల

బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులకు ఇన్కమ్ టాక్స్ రద్దు చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. బుధవారం ఆర్కే న్యూటెక్ గనిలో ఎస్సీకేఎంఎస్(బీఎంఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇన్కమ్ టాక్స్‌ను రద్దు చేయడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన మొత్తం బకాయిలు చెల్లిస్తామన్నారు. అంతేకాకుండా బీజేపీకి అవకాశం ఇస్తే నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంజనీరింగ్ కాలేజీతో పాటు మౌళిక సదుపాయాలతో కూడిన స్మార్ట్ సిటీగా మున్సిపాలిటీని తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర నాయకులు పేరం రమేష్, బరుపాటి మారుతి, భీమయ్య, మిట్టపల్లి మొగిలి, గోపతి సందీప్, పంచరపుల నరేష్, వినోద్, కొండ వెంకటేష్, సిరికొండ రాజు పాల్గొన్నారు.

రూ.5 లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు నిత్యం తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో నస్పూర్ ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో తనిఖీల్లో కుశనపల్లి గంగారం వద్ద రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకి అందజేశారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

ఒత్తిడి వల్లనే డిసెంబర్ 27న ఎన్నికలు

నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఒత్తిడి వల్లనే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను సార్వత్రిక ఎన్నికల తర్వాత డిసెంబర్ 27న నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్యం, సింగరేణిలోని 13 సంఘాలు గుర్తింపు సంఘానికి లొంగిపోయి సార్వత్రిక ఎన్నికల తర్వాత గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ముందు అభ్యర్థించాయని ఆరోపించారు. దాని కారణంగా కోర్టు కూడా ఎన్నికలను వాయిదా వేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేయించడానికి చేసిన కుట్రపూరిత చర్యలో భాగస్వాములైన 13 సంఘాలను కార్మికులు రాబోయే రోజుల్లో సరైన గుణపాఠం చెప్తారన్నారు.

కోరుకంటిని భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యం

నవతెలంగాణ-గోదావరిఖని

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోమారు భారీ మెజారిటీతో గెలిపించడమే మా లక్ష్యం బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు దొమ్మేటి వాసు అన్నారు. 35వ డివిజన్‌లో బీఆర్ఎస్ యువజన నాయకులు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్సన్, సునీల్, రంజిత్, అవినాష్, కిరణ్, రామరాజు, రాజు, సాగర్, వంశీ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో నూతన నియమాకాలు

నవతెలంగాణ-గోదావరిఖని

రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ ముఖ్య అధికార ప్రతినిధిగా జిట్టవేన ప్రశాంత్ ముదిరాజ్, రామగుండం కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధిగా దండు రవీందర్ ముదిరాజ్, రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులుగా తూడి రాజయ్య ముదిరాజ్, కాశవేని రాజయ్య ముదిరాజ్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వారికి నియామకపు ఉత్తర్వులు అందజేశారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న బీఎంఎస్

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో కార్మికుల హక్కుల, సంస్థ పరిరక్షణ కోసం బిఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అవిశ్రాంతమైన పోరాటం చేస్తుందని యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఈసారి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆశీర్వదించి, గెలిపించాలని ఆయన కార్మికులను కోరారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జిడికె 5 ఓసిపిలో బుధవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బిఎంఎస్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కొత్త కాపు లక్ష్మారెడ్డి కృషి బొగ్గుగని కార్మికుల కష్టార్జితంమైన సీఎంపిఎఫ్ భవిష్య నిధి సిఎంపీఫ్ డిజిటల్ ఆన్ లైన్ సేవలతో బొగ్గు గని కార్మికులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. పిట్ కార్య దర్శి పల్లె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆకుల హరిణ్, నాయకులు మాదాసి రవీందర్, పోరండ్ల వెంకటేష్, తాట్ల లక్ష్మయ్య, నీలం శ్రీనివాస్, రాపోలు వజ్రవేణు, సల్వాజీ మనోహర్, అడ్ల వెంకటరెడ్డి, జనగాని రవీందర్, బండి మహిపాల్, కాంట్రాక్టు కార్మిక సంఘము కేంద్ర ఉపాధ్యక్షులు బండారి శ్యాంసుందర్ తదితరులున్నారు.

డెంగ్యూతో ఒకరి మృతి

నవతెలంగాణ-ముత్తారం

మండలంలోని హరిపురం గ్రామానికి చెంది బోడ తిరుపతిరెడ్డి(55) డెంగ్యూ జ్వరంతో బుధవారం మృతి చెందాడు. తిరుపతి రెడ్డి వారం రోజుల నుంచి డెంగ్యూ జ్వరంతో బాధ పడుతున్నాడు. దీంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్నారు. జ్వరం తగ్గకపోవడంతో మంగళవారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ అక్కడ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్ప, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

సాంఘిక దురాచారాలపై కళాజాత

నవతెలంగాణ-తాండూర్



కళాజాతలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

మంత్రాలు చేతబడి పేరుతో అమాయక ప్రజలు వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటురని మంత్రాలు చేతబడి మూఢనమ్మకం మాత్రమేనని తాండూర్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ కళాబృందం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తాండూర్ ఎస్సై ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంర్భంగా సీఐ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరిత్య నేరమని అన్నారు. సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని సమస్య ఆలోచన పరిష్కార మార్గాలను వెతకాలని తెలిపారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న సాంఘిక దురాచారాల రూపుమాపేందుకు విజ్ఞానవంతులు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. వివిధ చట్టాలపై గ్రామీణ ప్రజలను అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు రోడ్డు ప్రమాదాల నివారణ లైంగిక వేధింపులు షీ టీమ్, డయాల్ 100, అభయ యాప్, గురించి ఇతర రుగ్మతలపట్ల ఆట, పాటల ద్వారా నాటికల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై లక్ష్మణ్ పోలీస్, కానిస్టేబుల్ బి.నరేష్, లక్ష్మణ్, సంతోష్, నరేందర్ పాల్గొన్నారు.

ఆర్కే-న్యూటెక్ గనిలో ఉద్యోగ క్రీడాకారులకు సన్మానం



ఉద్యోగ క్రీడాకారులకు సన్మానిస్తున్న గని ఎస్ఓఎం ఇ.స్వామిరాజు

నవతెలంగాణ-మంచిర్యాల

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గనిలో పని చేస్తూ వివిధ క్రీడల్లో రాణిస్తున్న ఉద్యోగ క్రీడాకారులకు గని ఎస్ఓఎం ఇ.స్వామిరాజు ఘనంగా సన్మానించారు. బుధవారం గని ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఏరియా క్రికెట్ జట్టు కెప్టెన్ శశికాంత్, జట్టు సభ్యుడు నరేందర్, వెయిట్ లిఫ్టింగ్‌లో ఏరియా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన అజయ్యని సన్మానించిన ఎస్ఓఎం షీల్డ్ అందజేశారు. అనంతరం ఎస్ఓఎం మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉద్యోగులకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కొత్తగా వస్తున్న ఉద్యోగులు ఆటలపై దృష్టి పెట్టాలని సూచించారు. విధి నిర్వహణలో ఎప్పుడూ తీరిక లేకుండా ఉండే ఉద్యోగులకు క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కల్గిస్తాయని పేర్కొన్నారు. నిత్యం క్రీడల్లో పాల్గొంటే ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టె రమేష్, సంక్షేమాధికారి పాల్ సృజన్, జేఓ స్టాన్లీ జోన్స్, పిట్ ఇంజినీర్ రాజగోపాలచారి, ఇంజినీర్ కృష్ణ, సర్వే అధికారి పిచ్చేశ్వరావు, వెంటిలేషన్ అధికారి చంద్రమౌళి, అండర్ మేనేజర్లు పరమేశ్వర్, సాత్విక్, కార్మిక సంఘాల ప్రతినిధులు బుస్స రమేష్, జంపయ్య, జె.శంకర్రావు, వినయకుమార్, ఆకుల లక్ష్మణ్, చంద్రశేఖర్, సురేందర్, అజయ్, మహేందర్ పాల్గొన్నారు.

తుడుందెబ్బ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాసిపేట మండల కమిటీని ఎన్నుకొని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా ఆత్రం జంగు, అధ్యక్షులుగా, సంద్ర భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా కుర్సింగ తిరుపతి, కోశాధికారిగా బద్ది శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కనక గోవర్ధన్, మహేశ్, రెడ్డి లక్ష్మణ్, రాయిసీడం శంకర్, ఆత్రం ప్రశాంత్, మడావి రమేశ్, కార్యదర్శులుగా కొడక భీంరావు, మెస్రం రాజ్కుమార్, మేంద్రపు రాజయ్య, రొడ్డ అనీల్, మంగ శ్రీకాంత్, పల్కు సాయి ప్రసాద్, ఆత్రం అచ్యుత్‌రావు, కనక మాన్కు, సంయుక్త కార్యదర్శులుగా ఆడ మనోజ్, ఆడ జీవన్, తుంరం అర్జున్, రాయిసిడం తిరుపతి, ప్రచార కార్యదర్శులుగా టేకం భీంరావు, లావుడం నవీన్, కుడ్మెత వసంత్, కుర్సింగ మహేశ్, మడావి మధూకర్, చిక్రం రాందాస్, సలహాదారులుగా కొమ్ముల బాపు, రాయిసిడం రాందాస్, కొడప శ్యాంసుందర్, రొడ్డ రవీందర్, టేకం శ్రీనివాస్, గెడం సీతారాంలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు మడావి వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి ఆడే జంగు, జిల్లా ఉపాధ్యక్షులు కనక రాజు, నాయక్ పోడ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు వెడ్మ కిషన్లు ప్రకటించి, నియామకపత్రాలు అందించారు.

బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తా



నవతెలంగాణ-కాసిపేట

నవంబర్ 30వ తేదీన జరిగే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున పోటీ చేస్తున్న తనకు బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బెల్లంపల్లి అసెంబ్లీ ఇన్‌ఛార్జి కొయ్యల ఏమాజి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం కాసిపేట్ మండలంలోని ధర్మారావుపెట్ గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామానికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఒక్కసారి కూడా రాలేదని, రాబోయే ఎన్నికల్లో ప్రచారానికి వస్తే తడాఖా చూపిస్తామని మహిళలు చెప్పారు. ఈ సందర్భంగా ఏమాజి కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు దేవుసింఘ్, గజానన్ నాయక్ పాల్గొన్నారు.

కాసిపేట-2 ఇన్‌క్లైన్ గని జీఎం తనిఖీ

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిని మందమర్రి జీఎం మనోహర్ బుధవారం గనిలోని పని స్థలాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మనోహర్ మాట్లాడుతూ కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిలో మ్యాన్ రైడింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని జీఎం అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల భద్రత, సామర్థ్యం దృష్టిలో పెట్టుకొని మైనింగ్ కార్యకలాపాల యొక్క వివిధ అంశాలను నిశితంగా అంచనా వేశారు. గనిలో కొనసాగుతున్న చైర్ లిఫ్ట్ మ్యాన్ రైడింగ్ పనులను సమీక్షించి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. గనిలోని ఏయిర్ షాఫ్ట్, వెంటిలేషన్ను పరిశీలించి, వెంటిలేషన్‌ను మెరుగుపరచడానికి సలహాలు ఇచ్చారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ జే రాగరాజ్, ఏజెంట్ రాందాస్, గ్రూప్ ఇంజనీర్ రామ ప్రసాద్, మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖనిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ విషయంలో ట్రస్ట్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులపై కొంతమంది మాల సంఘం నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని, సహించేది లేదని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ హెచ్చరించారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ భవన్ కమిటీ, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు మంతెన లింగయ్య, ఇరుగురాల కష్ణయ్య, గద్దల శశిభూషణ్, పోగుల రంగయ్య, బూడిద మహేందర్, యాసర్ల చిరంజీవి, దుబాసి బొందయ్య, బొట్ల స్వామి కొంకటి వెంకటేష్, కనుకుంట్ల సమ్మయ్య, నాతరి ఆదిత్య, ఉప్పులేటి హనుమంతు, చిత్తారి సదానందం తదితరులున్నారు.

నియోజకవర్గ యువజన కార్యదర్శిగా రమేష్



నవతెలంగాణ-భీమారం

చెన్నూర్ యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరిగా అర్కాల రమేష్‌ను నియమిస్తు బుధవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ నియామక పత్రం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన అర్కాల రమేష్ కాంగ్రెస్ భలోపేతానికి కృషి చేస్తున్నట్లు గుర్తించిన ఆమే రమేష్‌ను చెన్నూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తు మంచిర్యాలలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా తమవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూత్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి, మంచిర్యల జిల్లా యూత్ అద్యక్షుడు తాల్లా సంపత్ రెడ్డి, పీసీసీ సభ్యులు నూకల రమేష్, భీమారం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఆదర్శ విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్


జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినీలు చౌదరి వైష్ణవి, అడే గాయత్రి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 17న సంగారెడ్డిలో నిర్వహించినున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అదేవిధంగా పుణేలో గత నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి అండర్-17 సాఫ్ట్ బేస్ బాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో రజత పతకం సాధించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ వొజ్జల పూజితను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడి తిరుపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చూపి ఎంహెస్‌ఆర్డీ స్కాలర్ షిప్కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతికుమార్ తెలిపారు. బైపీసీ సెకండీయర్ విద్యార్థి అర్పిత, ఎంపీసీ సెకండియర్ విద్యార్థి అభినందినిలు మినిస్ట్రీస్ ఆఫ్ హ్యూమర్ రిసోర్స్ డెవలప్మెంట్ స్కాలర్ షిప్కు ఎంపిక కాగా వీరికి ఐదేళ్ల వరకు పైచదువుల కోసం సంవత్సరానికి రూ.10 వేల చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమిని నాయబ్ తహసిల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-భీమిని

భీమిని మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా బుధవారం ఎన్.అంజయ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో తాండూర్ మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశాను అన్నారు. తాండూర్ తహసీల్దార్ కార్యాలయం నుంచి భీమిని మండలంలోని తహసీల్దార్ కార్యాలయంకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

వ్యాపారస్తులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

నవతెలంగాణ-గోదావరిఖని

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని వ్యాపారస్తులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటానని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భవిష్యత్తు లేదని ఇక్కడ వ్యాపారుల నానుడి ఉండేదని, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంతో వైద్య కళాశాల ప్రారంభించామన్నారు. బుధవారం రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 50 వ డివిజన్ లో ఓ ఫంక్షన్ హాల్లో లక్ష్మి నగర్ వ్యాపార వర్గాలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరిఖని ప్రధాన వ్యాపార కేంద్రామైనా లక్ష్మి నగర్‌లో వన్ ఎర్పాటుతో వ్యాపారుల సాగకా అనేక ఇబ్బందులు వ్యాపారులు పడేవారని, తాము ఎమ్మెల్యే గెలిచిన తర్వాత పోలీసు అధికారులతో మాట్లాడి లక్ష్మినగర్లో వన్‌వే ఎత్తి వేయించామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీ కి భారీ మెజార్టీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, నాయకులు కౌశిక హరి, కార్పోరేటర్ గనముక్కల మహాలక్ష్మి తిరుపతి, కల్వచర్ల కష్ణ వేణి భూమయ్య, బాల రాజ్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు ఎండి.రఫీ, వంగ శ్రీనివాస్ గౌడ్, నాయకులు తానిపర్తి గోపాలరావు, బాలసాని స్వామి గౌడ్, లక్ష్మి నగర్ వ్యాపార సంఘాల నాయకులు, వ్యాపారులు నడిపెల్లి సాగర్ రావు, బంక రామస్వామి, ముచ్చకుర్తి చంద్రమౌళి, తూముల అశోక్ రావు, ఎల్లప్ప, లక్ష్మినారాయణ చారి, రాజేందర్ తదితరులున్నారు.

నవతెలంగాణ ఆదిలాబాద్

గురువారం | అక్టోబర్ 12, 2023 | www.navatelangana.com

ఫేక్ ఐడీలతో డబ్బుల వసూలు.. పట్టుకున్న గ్రామస్థులు

నవతెలంగాణ-పెంబి



అమత ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ఐడీ కార్డులతో నలుగురు వ్యక్తులు రెండు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. గ్యాస్ కంపెనీ నుంచి వచ్చామని సర్వీస్ చేస్తామని చెబుతూ రూ.2 నుంచి రూ.4 వందల వరకు వసూలు చేస్తున్నారు. మందపల్లి గ్రామంలో రెండు రోజులుగా ఇలానే జరుగుతోంది. గమనించిన గ్రామస్తులు వారిని పట్టుకొని ప్రశ్నించారు. వారు ఫేక్ ఐడీతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన గ్రామస్తులు వారిని గ్రామపంచాయతీ భవనంలో నిర్బంధించారు. పోలీసులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. దీంతో వినియోగదారుల నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి ఇచ్చారు.

ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి

నవతెలంగాణ-దస్తురాబాద్



ప్రతి ఒక్కరు బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని ఎస్‌బీఐ వినియోగదారుల సేవా కేంద్రం నిర్వాహకుడు గట్టు సత్యనారాయణ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు ఎస్‌బీఐ ఖాతాలను తెరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉన్నప్పుడే ప్రభుత్వం నుండి అందించే రాయితీలు, రానున్న రోజులలో పూర్తిగా డిజిటలైజేషన్ ద్వారానే డబ్బులు చెల్లింపు జరగనున్నాయని తెలిపారు. ఈ విషయాన్నీ దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ తిరుమల, ఉపాధ్యాయురాలు శ్రీలత పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆర్టీసీ స్థలంలో మొదలైన ప్రహరీ గోడ పనులు



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగా ఉన్న లే అవుట్‌లోని 20 ఫీట్ల రోడ్డును ప్లాట్లు చేసి కొత్త లే అవుట్ తయారు చేశారు. ఈ విషయంపై కాంగ్రెస్ నాయకులు పలుమార్లు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకొని బుధవారం పనులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్టీసీ డీఈ ఆంజనేయులు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆర్టీసీకి 1.20 ఎకరాల భూమి ఉందని, అందులో కొంత స్థలం ఆక్రమణకు గురికావడంతో సర్వే చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ చుట్టు రూ.6 లక్షలతో ప్రహరీగోడని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ స్థలంలో ఉన్న ఇండ్లకు నోటీసులు ఇచ్చి తొలగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఏఈ అజయ్, స్టేషన్ మేనేజర్ జనార్దన్ పాల్గొన్నారు.

అడెల్లి ఆలయానికి రూ.39లక్షల ఆదాయం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధి గాంచిన అడెల్లి శ్రీమహా పోచమ్మ ఆలయంలో బుధవారం హుండీ లెక్కించారు. ఈ లెక్కింపులో రూ .39 లక్షల,19 వేలు, 248గ్రాముల బంగారం, 5కిలోల 720 గ్రాముల వెండి ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రంగు రవికిషన్, చైర్మెన్ అయిటి చందు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుచరిత రాజేశ్వరరావు, ఆలయ ధర్మ కర్తలు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావ్, రికార్డ్ అసిస్టెంట్ బుచ్చన్న, సోని, భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలికల దినోత్సవం



నవతెలంగాణ-తలమడుగు

మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికాత, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని లింగి కేజీబీవీ పాఠశాలలో నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఆడపిల్లలపై ఉండే వివక్షత, హింస, బాల్యవివాహాల వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. బాలికల కోసం ఉన్న చట్టాల గురించి తెలుసుకోవడంతో పాటు తల్లిదండ్రులకు తెలియజేయాలని డీసీపీఓ రాజేంద్రప్రసాద్, మహిళ సాధికార జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ సతీష్, ఎల్‌పీఓ రమేష్, సఖీ నిర్వాహకులు సరస్వతి, డీహెచ్‌ఈడబ్ల్యూ టీమ్ సిబ్బంది, కేజీబీవీ ఎస్ఓ సువర్ణ పాల్గొన్నారు.

ఐటీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన బోథ్ నాయకులు

నవతెలంగాణ-బోథ్



రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్‌ను మాజీ మంత్రి గొడం నగేష్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్, ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ రాజు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే జరగబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా ఉంది సైనికుల్లా పనిచేయాలని నాయకులకు మంత్రి సూచించారు.

ఆయుధాలను వెంట తీసుకెళ్లడం నిషేధం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ శాసనసభ సాధారణ ఎన్నికలు-2023 షెడ్యూల్ విడుదలైన సందర్భంగా ఆయుధాలు కలిగి ఉండటంపై భారత ఎన్నికల సంఘం నిషేధ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు షెడ్యూల్ విడుదలైన తేదీ నుండి లైసెన్స్ పొందిన ఆయుధాలను తీసుకెళ్లడం నిషేధిస్తూ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ పొందిన ఆయుధాలు, కత్తులు వంటివి వెంట తీసుకువెళ్లడం నిషేధమని, ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు నిషేధ ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు. ఉత్తర్వులను పటిష్టంగా అమలు చేసేందుకు పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం శాసనసభ ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని నోడల్ అధికారులకు సూచనలు చేశారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కౌంటింగ్ సూపెర్వైజర్లు, అబ్జర్వర్ల నియామకాల కోసం సరిపడా సిబ్బందిని గుర్తిస్తూ, ర్యాండమైజేషన్ ద్వారా నియామకాలు జరపాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులు నిర్వహించాలని, అవసరమైన సిబ్బందిని రిజర్వులో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నియోజకవర్గాల వారిగా సరిపడా వాహనాలను సిద్ధం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంట వెంటనే నివేదికలు సమర్పించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ నెల 31 వరకు ఓటరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పోలింగ్ శాతం పెంచేందుకు ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం, కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలని స్వీప్ నోడల్ అధికారిని ఆదేశించారు. అక్రమమద్యం, నగదు, మత్తు పదార్థాలు సరఫరాపై గట్టి నిఘా ఉంచాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్స్, ర్యాంపులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించి తక్షణమే సౌకర్యాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్త, శ్యామల దేవి, ఆర్డీఓ స్రవంతి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఇబ్బందులు కలుగకుండా చర్యలు



నవతెలంగాణ-జైనథ్

ప్రకృతి వైపరీత్యాల కారణంగా తర్నం వంతెన కుంగిపోయిన నేపథ్యంలో రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఎమ్మెల్యే జోగు రామన్న తాత్కాలిక వంతెన నిర్మాణ పనులను పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. భారీ వాహనాలను ఈ వంతెన గుండా వెళ్లనీయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక వంతెన నిర్మాణాన్ని చేపట్టామని, లాండసాంగి గుండా రూ. 40 కోట్ల వ్యయంతో చేపడుతున్న రహదారి నిర్మాణం త్వరలోనే పూర్తై అందుబాటులోకి రానుందన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను కేంద్రం పట్టించుకోదని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన కుటుంబంలో బాధ్యతగా వ్యవహరిస్తుందన్నారు. జైనథ్, బేల మండలాల ప్రజలకు సమస్యలు ఉత్పన్నం కాకుండా తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. కేంద్రం పరిధిలో ఉన్న వంతెన నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభం కావాల్సి ఉండగా కాలేదన్నారు. అప్పటివరకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక వంతెన నిర్మాణానికి పూనుకున్నామన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

- ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఈఎంఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 3 నుండి 6వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో ఇంద్రవెల్లికి చెందిన ఈఎంఆర్ఎస్ పాఠశాల విద్యార్థులు లాల్ సాబ్ ఇన్‌స్ట్రుమెంట్‌లో ప్రథమ బహుమతి, జే.అంకుష్ నాయక్ ఇండిజీనియస్ టాయిస్ మేకింగ్‌లో తృతీయ బహుమతులు సాధించి ట్రాఫీతో పాటు ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం తన కార్యాలయంలో ఆ విద్యార్థులను పీఓ చాహత్ బాజ్‌పాయ్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడే తత్వం, పట్టుదల, కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. విద్యార్థులు చదువుకుంటూ వివిధ రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. అందరిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, సమయం వచ్చినప్పుడు ఆ కళను బయటికి ప్రదర్శించాలని అన్నారు. విద్యార్థులకు అన్ని విధాలుగా సహకరిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ గంగాధర్, ఈఎంఆర్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కాంబ్లే అనిల్ కుమార్, ఉపాధ్యాయులు గుణశ్రీ, నర్సయ్య, స్వప్న పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలను ఘనంగానిర్వహిస్తాం

- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- బాసర ఆలయ ఈవో విజయరామారావ్

నవతెలంగాణ-బాసర

జ్ఞానసరస్వతి దేవి నవరాత్రి ఉత్సవాలను ఈనెల 15 నుంచి 23 ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆలయ ఈఓ విజయరామారావు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ ఏర్పాట్లుచేస్తామని పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై బుధవారం నవతెలంగాణతో ఆయన పలు వివరాలను తెలియజేశారు. ఈ నెల 15 నుండి 23 వరకు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిత్యం పూజాది కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. తొమ్మిది రోజులు అమ్మవారు భక్తులకు తొమ్మిది రూపాలతో దర్శనమిస్తామన్నారు. దీనికి కోసం ప్రత్యేక ఏర్పాట్లుకూడా చేసినట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు అక్షరాభ్యాస పూజ రూ.150 టికెట్, రూ.1000 టికెట్‌కు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు, దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మవారి జన్మనక్షత్రం మూల నక్షత్రం ఈ నెల 20న శుక్రవారం వస్తుందని, భక్తులు, చిన్నారులు వేల సంఖ్యలో రానున్న దృష్ట్యా చిన్నారులకు దేవస్థానం తరపున ఉచితంగా పాలు, బిస్కెట్ పంపిణీ చేస్తామని తెలిపారు. గోదావరి నది లోపలకు వెళ్లకుండా స్నానాలు ఆచరించే వరకు కంచె, గాజ ఈతగాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భైంసా ఏఎస్పీ ఆదేశాలతో పోలీసులు బందోబస్తు చేడుతున్నామని తెలిపారు.

అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి

నవతెలంగాణ-సారంగాపూర్

సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని మండలం సిరిపెల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం ఆయన తనిఖీ చేశారు. డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా చూడాలని సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- డీఎస్పీ గంగారెడ్డి

లక్ష్మణచాంద: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉన్నతధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని బెల్ట్ షాప్‌లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రూ.44 వేల రూపాయలు విలువ చేసే 121 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బెల్ట్ షాప్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.


సారంగాపూర్


లక్ష్మణచాంద

బీఆర్ఎస్ పలువురికి పదవులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్‌లో పలువురికి పదువులను కేటాయిస్తు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశ్విన్ కుమార్, పట్టణ మైనార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పర్వీన్ సుల్తానా నియమించారు. పార్టీని మరింత పటిష్టపరిచేందుకు కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని విజయానికి దోహదం చేయాలని సూచించారు.

ఎస్పీ చేతుల మీదుగ లఘుచిత్రం విడుదల



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణానికి చెందిన యువకులు సైబ్ క్రైమ్‌కి సంబంధించి రాజు గారి రాజ్యం అనే లఘు చిత్రం తీశారు. బుధవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఆయనున్న మర్యాద పూర్వకంగా కలిసి చిత్రాన్ని విడుదల చేయించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజనలు చైతన్య పరిచేల ఇలాంటి షార్ట్ మూవీ తీయడం అభినందనీయమని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కిరణ్, నటీనటులు హరికృష్ణ కుర్మే, ఎనగంటి సతీష్, అనుదీప్ చిట్టిమల్ల, మోతే జ్ఞానేశ్వర్, పెండల సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హాయంలోనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి జరిగిందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని వార్డ్ నెంబర్ 19 వరలక్ష్మి నగర్‌కు చెందిన సోషల్ వర్కర్ మతిన్‌తో పాటు మహిళలు, యువకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే జోగు రామన్న కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మొదట బ్యాండ్ మేళాలతో టపాసులు పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నత కొలువులు సాధించగలుగుతున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ 70ఏళ్ళు పరిపాలించి జనానికి చేసిందేమీ లేదని, అబద్ధపు కాలయాపన చేస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ఒకచోట సఖ్యత లేకుండా, మరోచోట అల్లర్లు ఆయా రాష్ట్రాల్లో ప్రజలు అసంతృప్తిని ఎదుర్కొంటున్నారన్నారు. తెలంగాణలో ప్రజలు మాత్రం అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, సాజిదొద్దీన్, సలీం పాషా, సదర్, రసూల్, ఆనంద్, బాదం గంగన్న, అబూజర్ పాల్గొన్నారు.

ముఖ గుర్తింపు హాజరుకు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యంలోనీ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సరైన అవగాహన కల్పించి ఫేషియల్ రికగ్నైజేషన్ విధానం(ముఖగుర్తింపు హాజరు) ద్వారా 100% విద్యార్థుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని డీఈఓ ప్రణీత సూచించారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తైన విద్యార్థుల హాజరు ప్రతిరోజు నమోదు అయ్యేలా చూడాలని మండల విద్యాధికారులకు వారి సిబ్బందికి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మండల విద్యాధికారులు, ఎంఐఎస్, కోఆర్డనేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లకు నిర్వహించిన శిక్షణలో ఆమె పాల్గొన్నారు. యూడైస్ పోర్టల్‌లో విద్యార్థుల చేర్పులు, తొలగింపు, విద్యార్థుల మార్కులు వేయడం తదితరాలతో పాటు ముఖ గుర్తింపు హాజరు నమోదు చేసే విధానం ప్రధానోపాధ్యాయులకు వివరించాలని డీఈఓ అన్నారు. అలా ఎవరి పాఠశాల స్థాయిలో వారు అన్ని పనులు చేసుకోగలిగినప్పుడే అన్ని రిపోర్టులు సకాలంలో అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి జే.నారాయణ, సహాయ గణాంక అధికారి ఉస్మాన్, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదశావత్తు నీటి కుంటలో పడి వ్యక్తి దుర్మారణం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రమాదశావత్తు నీటి కుంటలో పడి వ్యక్తి దుర్మారణం చెందిన సంఘటన బుధవారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ప్రకారం...మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన పుట్టి లింగన్న(38) చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం మల్లాపూర్ నుండి చేపలు పట్టేందుకు చింతల్‌చందా గంగాకు వెళుతుండగా మార్గ మధ్యలో ఫిట్స్ వచ్చాయి. మండల కేంద్రంలోని సహాద్రోణ స్కూల్ సమీపంలో గల నీటిలో బోర్లా పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. మృతుడికి భార్య ముగ్గురు కొడుకులు ఉన్నారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.